# "తుమ్మెదా ఒకసారి...."

తురగా కృష్ణమోహన్‌రావు

"తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని చెప్పవే రాచిలుక తోడ" అంటూ పాడడం ప్రారంభించాడొక గాయకశిఖామణి. తుమ్మడాన్ని గురించి ఎందుకు పాడవలసివచ్చిందో నాకర్థంకాదు. బహుశః ఆయనకు తను బాగా తుమ్మగలనని గర్వం అయి వుండవచ్చు. మనుష్యులకు అనేక రకాల గర్వాలు ఉంటాయిట. పొడుగ్గా ఉన్నానని ఒకరికి గర్వం అయితే పొట్టిగా ఉన్నానని మరొకరికి గర్వం. తను డబ్బు విషయంలో చాలా పొదుపుగా ఉంటానని ఒకరికి గర్వం అయితే తను డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టగలనని వేరొకరికి గర్వం. తనకి ఆత్మగౌరవం, గర్వం ఇత్యాది ఎక్కువగా ఉన్నాయని ఒకరికి గర్వం అయితే అసలు తనకి గర్వమన్నదే లేదని గర్వం మరొకరికి.

పయిన చెప్పానుగా-ఆయనకు బహుశః తను బాగా తుమ్మగలనని గర్వం ఏమోనని?

అసలు నన్నడిగితే బాగా తుమ్మగలనని గర్వం కలిగిఉండడంలో అర్థంలేదు. కాని- మనుష్యులనేక రకాలుగా ఉంటారు. వాళ్ళకనేక రకాల గర్వాలు ఉంటాయి. మనమేమీ అనడానికి వీల్లేదు.

నాకు మటుకు నాకు తుమ్మడమంటే అదో రకమైన భయం. తుమ్మేటప్పుడు మొహం అష్టవంకరలుగా తయారవుతుంది. స్వతహాగా నామొహం కొంచెం తీరుగా ఉంటుందేమో - ఈసంగతి మా ఆవిడకూడా కాదనడానికి వీల్లేదు! - తుమ్మితే మరీ అసహ్యంగా తయారవుతుంది. ఆవిడ గారు అప్పుడప్పుడు నన్ను ఏడిపిద్దామని ప్రయత్నం చేస్తూంటుంది. ఈమధ్యనే ఒకసారి చల్లగా నాపక్కన చేరి అంది: "ఏమండీ! మీరు నిన్న తుమ్ముతోంటే చూశాను. ఎంతో బాగున్నారు. సరిగ్గా దిలీప్ కుమార్ లా ఉన్నారు." నేనా మోసపోయే వాణ్ణి? నాకు తెలియదూ - దిలీప్‌కుమార్ తుమ్ముతూండగా ఆవిడ ఎప్పుడూ చూడ లేదని?

ఒకవిషయంలోనుంచి ఇంకోవిషయంలోకి పోయినట్టున్నాను. ఆపాట పాడిన పెద్దమనిషిని గురించి కదూ చెప్తున్నాను? ఆయనకు బాగా తుమ్మగలనని గర్వం ఉందనుకోండి. నిజంగా ఆయనకు గర్వమే ఉంటే అవకాశమున్నప్పుడల్లా తుమ్మడానికి ప్రయత్నించాలి! తుమ్ములు వస్తే అప్రయత్నంగానే తుమ్మాలి; తుమ్ములు రాకపోతే అథవా ముక్కుపొడుం పీల్చి అయినా తుమ్మాలి! ఉహూఁ! ఆయన అల్లా చేయడట. తుమ్మితే "ఒకసారి" మాత్రమే తుమ్ముతాడట. "తుమ్మెదా ఒకసారి" మాత్రమే అంటూ మనల్ని జడిపిస్తున్నాడు - ఆయన తుమ్ము ఏదో పెద్దవిలువగలదయినట్టు; ఒక్కొక్కసారి ఒక్కొక్క దానికంటె మనకు ఎక్కువ ప్రసాదిస్తే మనం ఏదో 'వేస్టు' చేసి పారేస్తామేమో అన్నట్టు.

ఇంతేకాదు. "మోమెత్తి చూడమని" అంటున్నాడు. "ఎవరి మోము?" అన్నది ప్రశ్న. తుమ్మేటప్పుడు కర్త - అంటే తుమ్మే పెద్దమనిషి అన్నమాట - రయిల్వే సిగ్నల్ లాగ తలకాయ దింపి తుమ్ముదుకదా? తనికి ఇష్టముఅన్నా లేకపోయినా తుమ్మేటప్పుడు తలకాయెత్తి తుమ్మవలసిందే. ఇంకా 'మోమెత్తి' అనడంలో అర్థమేమిటి? బహుశః కర్త ఇంకోవిధంగా ఉద్దేశించి ఉండవచ్చు. "నేను తుమ్ముతాను; నువ్వు నీ మోమెత్తి చూడు" అని అతని ఉద్దేశ్యం అయిఉండవచ్చు ఎందుకంటే - "నేను తుమ్ముతాను; మోమెత్తి - అంటే నా మోము నువ్వెత్తి - చూడు" అనే కనక కర్త ఉద్దేశ్యం అయితే దానికి చాలా అభ్యంతరాలుంటాయి. ఉదాహరణకు: ఒకటి రెండు చెప్తాను. తుమ్మడానికి ఎత్తిన మోమును ఇంకా ఎత్తి చూడడం అసంభవం. ఇంకో విషయం, ఏమిటంటే ఒకపక్కన తుమ్ము తుఫానులా ముంచుకొస్తూంటే 'సరిగమపదనిస' అని పాడుతూ తన మోమెత్తి చూడమని ఎదుటివాళ్ళని అడిగేవరకూ అవకాశం ఎక్కడుంది?

పోనీ కర్త ఉద్దేశ్యం: "తుమ్మెదా ఒకసారి మోమెత్తి - చూడమని చెప్పవే రాచిలుకతోడ" అనేమో అనుకుంటే దానికి కూడా ఒకటి రెండు అభ్యంతరాలున్నాయి. ఎవరికి తుమ్ము వచ్చినా మోమెత్తే తుమ్ముతారు. నా సంగతి నేను చెప్పానుగా! అందరూ అంతే. మాఇంటిపక్కని వెంకయ్యగారి తమ్ముడు తుమ్మడంటే మొహం 270° కోణంలో ఎత్తి మరీ తుమ్ముతాడు. మొహం ఎంత ఎత్తుతారు అన్నది ప్రశ్న కాని; ఎల్లరూ మొహంఎత్తి మరీ తుమ్ముతారన్నది పరమసత్యం. మరి ఈ కర్త ప్రత్యేకంగా తనే "మోమెత్తి" తుమ్మేటట్లు చెప్పకోడం దేనికి?

ఈపాటకి అసలు కారణమేమిటో నాకు తెలుసు. ఏమిటో ఒకనిమిషం ఆగి చెప్తానుండండి.

అయితే ఇంతవరకూ కర్తనుగురించి - అంటే తుమ్మబోతూన్న ఆ పెద్దమనిషిని గురించి - ప్రస్తావించాం. ఇక కర్మను గురించికూడా ఆలోచిద్దాం. "తుమ్మెదా... చెప్పవే!" ఎవరితోటి? రాచిలుకతోటి! మిమ్మల్ని అడుగుతున్నానని ఏమనుకోకండి కాని మీ రెప్పుడయినా చిలకతో తుమ్మడాన్ని గురించిమాట్లాడేవాళ్ళను చూశారా? నేను చూడలేదు. కర్తకూడా చిలక నుద్దేశించి ఈ పలుకులు పలికేడని నేను అనుకోను. ఇందులో అంతరార్థమేదో ఉంది.

## బామ్మగారి ప్రపంచయాత్ర

దాన్ని మరిచిపోయేందుకు సిగరెట్ వెలిగించాడు.

"అయితే బామ్మగారు ప్రపంచయాత్ర చేశారన్నమాట! బదరీకి అవతల ఇంకేం లేదుట!" ఒకడన్నాడు. ఆ ఘనత ఎందుకు కాదనాలి అని "అవును. బదరీతో ప్రపంచం ఆఖరు" అన్నారు బామ్మగారు. ప్రపంచం ఐదు ఖండాలు అని తెలిసిఉన్న దుర్జనులు కొందరు పొట్టలు పగిలేలా నవ్వేరు.

బెజవాడలో బామ్మగారికి టిక్కెట్టు తీసి పెట్టాను. బామ్మగారు "మహారాజు వౌతావ"ని దీవించారు. "మహారాజుగా పుట్టడం సులభంకాని అవడం చాలా కష్టం" అన్నాను (నేను మహారాజునౌతే మిమ్మల్ని మంత్రిగా వేసుకోనా! అనుకొని). దానికి బామ్మగారు "అట్లాగనకు నాయనా! చీనా అనేది ఎక్కడో ఉందనుకుంటామా! హిమాలయాలు దాటి చీనా వెళ్ళొచ్చు. నీకూ అదృష్టం అలాగే దగ్గరలో ఉందేమో" అన్నారు.

నేను తెల్లబోయాను. ★

మా క్లాసులో ఒక అమ్మాయి ఉండేది. ఆమెకు తలితండ్రులు ఏమి పేరు పెట్టారో తెలియదు. "భారత భాగ్యలక్ష్మి సత్యభిమేశ్వరి వెంకటరత్నం" అని పేరెట్టుండచ్చు; లేదా అంతకంటె పెద్ద పేరే పెట్టుండచ్చు కాని మే మందరం ఆమెను ముద్దుముద్దుగా "చిలకమ్మ" అని పిలిచేవాళ్లం. "పిలిచే వాళ్లం" - అంటే - అనే - అర్థమయిందిగా? అసలి పేరు ఎవరు పుణ్యం కట్టుకున్నాడో తెలియదు. ముప్ఫయిమూడు కోట్ల దేవతలు 'క్యూ'లో నిల్చునుండగా ఆమెకు ఈపేరెందుకు పెటవలసివచ్చిందో తెలియదు. బహుశః ఆమె ముక్కు చిలకముక్కులా ఉంటుందనేమో? లేకపోతే ఆమెకు జామపళ్లు ఇష్టమనేమో? ఏది ఏమయినప్పటికీ, ఆమె 'చిలకమ్మ'యి కూర్చుంది.

ఇదంతా ఎందుకు చెప్తున్నానో తెలుసా? "చిలకమ్మ" అనే పేరు మీరు విన్నారు కాని 'చిలకయ్య' అనే పేరు మీరు ఎప్పుడయినా విన్నారా? లేదు. అంటే 'A' అనే వ్యక్తి "చిలకా" అని 'B' అనే వ్యక్తిని పిలుస్తున్నాడనుకోండి (లేదా పిలుస్తోందనుకోండి). దాన్నిబట్టి మనకు ఏం తెలుస్తోందంటే 'A' - మగవాడయినా ఆడదయినా కావచ్చును కాని 'B' మాత్రం తప్పక ఆడదే! (మీకు రహస్యంగా చెప్తున్నాను - మళ్లీ కొంపతీసి మా ఆవిడ దగ్గర అనేరు! - అప్పుడప్పుడు మా ఆవిడ దూర్వాసుడి పాత్ర ధరిస్తోంటుంది. మరీ చేతులు దాటిపోతూంటే "చిలకా!" అని సున్నితంగా వ్యవహరిస్తాను. అంతే! ఎక్కడి కోపం అక్కడ పటాపంచలయిపోతుంది.)

అయితే మనకు స్పష్టమైన విషయం ఏమిటంటే - 'చిలక' అంటే అది ఒక స్త్రీ యొక్క సర్వనామం అని. మరి—'చిలక' ఆడదయితే 'రాచిలుక' మాత్రం కాదా యేం?

కర్త పాడుతున్నాడు: "నేను తుమ్మతున్నాను. మోమెత్తి చూడు!" అని. చూడవలసింది ఎవరు? ఒక 'రాచిలుక' - అంటే ఒక స్త్రీ. ఇంతకంటె అఘాయిత్యమేమైనా ఉందా? చెప్పానుగా? తుమ్మేటప్పుడు మొహం అష్టవంకర్లుగా తయారవుతుంది. కొంచెం అందంగాను నాజూకుగాను ఉన్న నా విషయమే అల్లా అయితే కొంచెం అటూ ఇటూగా ఉన్నవాళ్ల సంగతి ఏమిటి చెప్పండి. అందుచేత ఆత్మగౌరవం ఉన్న ఏ మగవాడయినా ఆడువారి ఎదుట తుమ్మడు. అదేవిధంగా ఆడవాళ్ల సంగతి కూడా.

ఈ పెద్దమనిషి ఈవిధంగా "తుమ్ముతా!" "చూడు!" అంటూ పాటలు పాడుతున్నాడా? మీకో విషయం చెప్పమంటారా? నే నింతకాలంనుంచి నా భార్యతో కాపురం చేస్తున్నాను. ఇంతవరకు మే మిద్దరం ఒకరెదురుగుండా ఒకళ్లం ఎప్పుడూ తుమ్మలేదు. అంటే అర్థమయింది కాదూ? ఒకసారిమాత్రం ఆవగింజంతలో ప్రమాదం తప్పిపోయింది. మా ఆవిడ చాకలాడికి బట్టలు వేస్తూంది. నాకు హఠాత్తుగా తుమ్ము వచ్చింది. అక్కడ అల్లా ఎందుకు తుమ్ము వచ్చిందో నే నింతవరకూ చెప్పలేను. విధికృతం అనుకుంటాను. "ఏయ్! పిల్లాడేడుస్తున్నట్టున్నాడు. పోయి చూసిరా!" అన్నాను. "లేదండీ! ఉయ్యాల్లో పడుకుని నిద్రపోతున్నాడు. ఏడుస్తున్నది పక్కింటివాళ్లిబ్బాయి" అంది నిశ్చలంగా. నాకు తుమ్ము తుఫానులా వస్తోంది. "వంటింట్లోంచి మాడువాసన వస్తోంది. కూర పొయ్యిమీద పెట్టి మరిచిపోయి చక్కా వచ్చినట్టున్నావు చూడు" అన్నాను. "లేదండీ! వంటంతా అయిపోయింది. కూర దింపి వచ్చాను." అంది అత్యంత ప్రశాంతంగా! ఆడవాళ్లు మాత్రమే అంత ప్రశాంతంగా జవాబు లియ్యగలరు ఒక పక్కన కొంపలు మునుచుకొస్తూంటే! వెయ్యి పంజాబ్ మెయిల్సు పరుగెత్తుకొచ్చినట్టుగా వస్తోంది నాకు తుమ్ము. అప్పుడేంచేసేది లేక ఎడంచేతివైపు గుమ్మంలోంచి వెళ్లి ఉయ్యాల్లో కుర్రాణ్ణి గట్టిగా గిల్లేసి కుడిచేతివైపు గుమ్మంలోంచి లోపలికి చక్కా వచ్చాను కుర్రాడు కేరుమన్నాడు. పద్దు పుస్తకం పారేసి "అయ్యో!" అంటూ పరిగెత్తింది నా ఇల్లాలు. "ఢాం!" అని తుమ్మేశాను నేను. భగవంతుణ్ణి తలచుకొన్నాడు చాకలాడు.

ఇదంతా ఎందుకని చెప్పానంటే ఆత్మగౌరవంగల ఏ మగాడూ ఆడదాని ఎదుట తుమ్మడానికి ఇష్టపడడు. నా సంగతి విన్నారుగా! కుర్రాడంటే నాకు అపరిమితమైన ప్రేమ. వాణ్ని చేతులారా గిల్లుతూంటే నేను పడిన బాధ - మొహం, చేతులు కూడా ఎర్రగా అయిపోయాయి! - లోహితాస్యుణ్ని అమ్మేటప్పుడు డి. వి. సుబ్బారావుగారు కూడా చూపించి ఉండరు. కడుపు తరుక్కుపోయింది. అయితేనేం? ఆత్మగౌరవం ప్రధానం! దానిముందు ఈ తుచ్ఛ మమకారాలు తొలగిపోవలసిందే!

అంటే కర్తగారిలో ఆత్మగౌరవం లోపించిందని నేను అనను. పాటను నేను బాగా చదివాను. మూలభావాన్ని నేను అర్థం చేసుకున్నానని అనుకొంటున్నాను. ఆ పాటలో ఒక ద్విగుసమాసం ఉంది. (ద్విగుసమాసమేనా అది?) అదే పాటకంతకీ ప్రధానమయినది. దానిని అర్థం చేసుకుంటే కర్తగారి మనస్తత్వం కూడా చక్కగా అర్థమవుతుంది. ఆ సమాసం ఏదో చెప్పమంటారా? వినండి: అదే "ఒకసారి."

మీకు తుమ్ముల్లో నమ్మకముందో లేదో తెలియదు. తుమ్ముల్లో ప్రతీవాడికి నమ్మకముంటుందిలెండి! ఉన్నా, లేకపోయినా - తుమ్ము వచ్చినప్పుడు తుమ్మి తీరవలసిందే! నే నడిగేది - ఏదయినా పని మొదలెట్టి


# జీవితమును
# మలబద్ధకము
## భారముగా చేయనీయకండి




తలనొప్పులు, కొవ్వెక్కినతనము, అజీర్ణమాంద్యము, తిమ్మిర్లు, మందగొడితనము ఇవన్నీ శరీరములోని అనవసరపదార్థముల వల్ల కలుగవచ్చును, కాని మలబద్ధకము మీ జీవితాన్ని పెద్ద భారముగా చేయవలసినది లేదు- బ్రూక్‌లాక్స్ సేవించగనే తిరిగి సత్తువ చేకూరును. రుచికరమైన యీ చాకొలేట్ విరేచనకారి మలాశయము ఉత్తేజపరచి మలిన పదార్థమును తప్పక నిరపాయముగా వెడలగొట్టును. ఈ రాత్రి ఒక చిన్న ముక్క సేవించుకొండి. రేపు ఎంత చులకనగా, ఎంత చురుకుగా వుంటుందో గమనించండి.

కాని తప్పక పేరడిగి బ్రూక్‌లాక్స్ అని మాత్రం కొనిచేసుకోండి.

**బ్రూక్‌లాక్స్**
మిమ్ము రాత్రికి రాత్రి
**సరిదిద్దును**
(వెస్ట్ మినిస్టర్ లాబొరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి నిర్మాణము)

ఏజంట్లు:
ఓరియంటల్ మర్కెంటైల్ ఏజన్సీ,
99 A, అర్మేనియన్ వీధి,
మద్రాసు-1.

ప్పుడు ఎవరైనా తుమ్మితే పని పాడవుతుందని - ఫలానావాడు తుమ్మితే పని నాశనమవుతుందని - ఇటువంటి నమ్మకాలు మీకేమైనా ఉన్నాయా? అని.

మా అన్నయ్యకు తుమ్ముల్లో బాగా నమ్మకం. ఏదైనా ఆలోచిస్తున్నప్పుడుగాని ఏదైనా పనిచేస్తున్నప్పుడుగాని ఎవరైనా తుమ్మేరా - అంతే! శాపనార్థాలు పెట్టేవాడు. ఎదుటివాడు చిన్నవాడయితే పైకి; పెద్దవాడయితే లోలోపల. కాని, నా ఖర్మంకాలి, నేను మా అన్నయ్యకంటె ఎప్పుడూ చిన్నవాడినే అయిపోయాను. ఒకప్పుడు అనుకుంటూంటాను: మిగిలిన వాటికోసం కాకపోయినా, అధమం తుమ్ములకోసమైనా నేను మా అన్నయ్యకంటె పెద్దవాణ్ణయితే బాగుండునని!

నేను మీకు చెప్పానుగా — నేను మా అన్నయ్యకంటె చిన్నవాణ్ణని? ఫలితమేమిటంటే - మా అన్నయ్యను కేంద్రంగా తీసుకొని అర్థమైలువ్యాసార్థంతో ఒకవృత్తాన్ని చుట్టి వృత్తంమధ్యలో నేనెక్కడ ఎప్పుడు ఎలాంటి పరిస్థితులలో తుమ్మినా, మా అన్నయ్య పెట్టేవాడు శాపనార్థాలు. ఒకవేళ ఖర్మంకాలి మా అన్నయ్య తలపెట్టినపని పెద్దదయినా, లేదా నేను తుమ్మిన తుమ్ము పెద్దదయినా - ఆవేళకు తూర్పు బెంగాలు శరణార్థుల్లాగ ప్రక్కింట్లో తలదాచుకోవలసిందే!

ఒకరోజున మా తాతగారిపక్కన కూర్చున్నాను. ఆయన పొడుం బాగా పీల్చేవాడు. కళ్లు చిన్నప్పుడే పోయాయి. నిశ్శబ్దంగా వచ్చి తీసుకుంటే పొడుంకాయ మన స్వాధీనం అయేది. ఒకపట్టు పొడుంతీసి ముక్కులోకి దట్టించాను. నాకేం తెలుసు? ఆవేళ పొడుంలో మిరపకాయల పాలు ఎక్కువ అయింది కాబోలు! ఢాం అని తుమ్మేశాను. సరిగ్గా మా అన్నయ్య కుడికాలు తీసి బండీలో పెడుతున్నాడు. వెంటనే ఆ కాలుకూడా కింద పెట్టేసి, పెద్దపులిలా వచ్చాడు లోపలికి. "ఏరా! తుమ్మడానికి ఇదే సమయం దొరికిందీ? నేను ఆఫీసుకు పోతున్నానుగదా! తుమ్మొస్తే లోపలికి పోయి తుమ్మలేవూ?" అన్నట్టు శబ్దాలు చేశాడు. ఇంకోనిమిషంఉంటే నాలుగు వేశేవాడే! ఈ లోపుగా నా చేతిలో ముక్కుపొడుం డబ్బీ కనబడింది. ఒక్కసారి ధర్మరాజులా మొహం పెట్టి "పొడుం పీల్చావేమిరా?" అన్నాడు.

నాపరిస్థితి అయోమయంలో పడింది. ముందు చూచిన అన్నయ్య; వెనుక చూచిన తాతయ్య. పీలవ లేదంటే అన్నయ్య మీద పడతాడు; పీల్చానంటే తాతయ్య వెనక పడతాడు. "ఏమిరా భగవంతుడా?" అని ఆలోచిస్తోంటే మళ్లీ ఇంకో తుమ్ము వచ్చింది. మా అన్నయ్య చిరునవ్వులు నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు.

మా అన్నయ్య చిరునవ్వులు విరజిమ్ముతూ పోడానికి కారణం ఉంది. తుమ్ము ఒకసారి తుమ్మితే ఎంత అపాయమైనాసరే రెండోసారి తుమ్మేటప్పటికి అదంతా కొట్టుకుపోతుంది. అయితే ముక్కుపొడుం ల్చినతుమ్ములు (అంటే అర్థం ముక్కుపొడుం పీలవగా వచ్చిన తుమ్ములు అన్నమాట!) లెక్కలోకి రావు.

ఈ తుమ్ముల్లో నమ్మకం ఉండడంవల్ల కొన్ని నష్టాలున్నా కొన్ని లాభాలుకూడా ఉన్నాయి. మా తెలుగు మాస్టారికి తుమ్ముల్లో బాగా నమ్మకం. ఆయన క్లాసులోకి వస్తే ఎక్కడ 'గ్రామరు' చెప్పుతాడో అని మాకందరికీ భయమేసేది. అందుకని రోజూ కొకడు చొప్పున వంతు వేసుకొని హెడ్ మాస్టరు గారి గది ప్రక్కన నుంచునేవాళ్లం. ఆయన సరిగా క్లాసు కొద్దామని బయలుదేరేసరికి ముక్కుపొడుం దట్టంగా పీల్చి తుమ్మేవాళ్లం. ఆయన 'నల్ల' దగ్గరకెళ్లి కాళ్లు కడుక్కొచ్చేవాడు. పాఠం మొదలెట్టి, దేముణ్ణి తలచుకొని, "రంతుల్ మానుము కుక్కుటాఘమ!" అనేసరికి ఎవడో వెనుకనుంచి "ఢాం!" అనేవాడు. దాంతో అరగంటవరకు పాఠం ఉపక్రమించేవాడు కాదు మా మాస్టరుసాబ్.

ఇంతకీ మీకు చెప్పదలుచుకున్నదేమిటంటే - ఒకసారి తుమ్మడానికి రెండుసార్లు తుమ్మడానికి చాలా తేడా ఉందని. ఇది సామాన్యుల విషయంలో. కొందరు పెద్దలుంటారు: వాళ్లు ఒకసారి తుమ్మినా ఒకటే; పదిసార్లు తుమ్మినా ఒకటే. మా వెంకయ్యగారి తమ్ముడుసంగతి చెప్పానను కొంటాను. మా ఊళ్ళో దుకాణాలవాళ్ళందరూ, ఏదైనా పెద్దబేరం వచ్చినప్పుడు, "వెంకయ్య తమ్ముడు లేడు కదా?" అటూ ఇటూ చూసి మరీ వ్యవహారం జరుపుకొంటారు. అతడు తుమ్మడంలో ప్రపంచానికి ఎంత ప్రమాదం తెచ్చిపెడతాడో - తుమ్మేవిధంవల్లకూడా అంతే ప్రమాదం తెచ్చిపెడతాడు. అంటే మీకర్థంకాలేదనుకొంటాను. మనం రెండురకాల తుమ్మేవాళ్ళను చూశాం; (లేదా విన్నాం) ఒకరకంవాళ్లు 'వార్నింగు' ఏమీ ఇవ్వకుండానే 'ఢాం' అని తుమ్ముతారు. వినగానే మనకు గుండె ఒకసారి ఆగిపోతుంది; కాని మళ్ళీ కొట్టుకోడం ప్రారంభిస్తుంది. రెండోరకంవాళ్లు రెండంతస్తులమేడ ఎక్కుతోన్నట్టు తుమ్ముతారు: "హాచ్ హాచ్ఛ హాచ్ఛ...హాచ్ఛ!" అంటూ. కాని మా వెంకయ్యగారి తమ్ముడు ఇల్లాగా కాకుండా అల్లాగా కాకుండా "హాచ్ హాచ్ఛహాచ్ఛ ...ఢాం!" అని తుమ్ముతాడు. అలవాటయినవాళ్లుతప్ప కొత్తవాళ్లు వస్తే చాలా ప్రమాదకరమయిన విషయం.

వెంకయ్యగారి తమ్ముడు ఒకసారి తుమ్మినా సరే పదిసార్లు తుమ్మినాసరే ఒకటే ఫలితం అని చూసినవాళ్లు (అంటే - అదే - విన్నవాళ్లు) అందరూ చెప్పుతూంటారు. కాని సామాన్యులవిషయంలో 'ఒకసారి' తుమ్మడం చాలా హానికరమయినదని ఒప్పుకోకతప్పదు.

ఇందాక చెప్పిన గాయకశిఖామణి పాడాడు: "తుమ్మెదా ఒకసారి" అంటూ. ఒక విషయం ఆలోచించండి. తుమ్మడానికి ముందు ఎన్నిసార్లు తుమ్మగలమో తెలుస్తుందా మనకు? తెలియదు; తెలియడానికి అవకాశం లేదు. తుమ్ము (లేక తుమ్ములు) రాబోతున్నది (లేక రాబోతున్నాయి) అని మాత్రం ముందు తెలియవచ్చు. కాని ఒకసారా రెండుసార్లా అన్న విషయం ముందు తెలియదు. అయినప్పుడు ఈ పెద్దమనిషికి ఒకసారి తుమ్మబోతున్నట్లుగా ఎల్లా తెలుసు?

దీనికంతకీ అర్థం ఒకటే ఉంది. ఆ "రాచిలుక" ఎవరో నాకు తెలియదు కాని ఆ "రాచిలుక" అంటే ఈ కర్తకు ఇష్టం లేదని మాత్రం తెలుసు. ఆమె అంటే ఇతనికి పడదు; ఆమె పని పాడుచేయాలని నిశ్చయం చేసుకున్నాడు. అతనికి తుమ్ముల్లో నమ్మకం ఉందా లేదా అన్నది సందేహాస్పదమైన విషయం; ఆమెకు నమ్మకం ఉందా లేదా అన్నది కూడా సందేహమే. నమ్మకం ఉంటే తుమ్ముయొక్క ఫలితం ప్రత్యక్షంగా కనిపిస్తుంది; లేకపోతే పరోక్షంగా కనబడుతుంది. నాకు మటుక్కు - పిచ్చినమ్మకాలు వేటిల్లోను - తుమ్ములతో సహా - నమ్మకంలేదు. అయినప్పటికీ, వెంకయ్యగారి తమ్ముడు తుమ్మితే కాస్త కాళ్లు కడుక్కొని మరీ చేస్తాను ఏ పనయినా! అందుచేత తుమ్ముల్లో నమ్మకం లేకపోయినా మనం ఏదయినా పని ప్రారంభిస్తోన్నప్పుడు ఎవరైనా తుమ్మాలని మనం అనుకోంగదా! అదే విధంగా పాపం ఆ 'రాచిలుక' ఏదయినా శుభకార్యం ప్రారంభిస్తోన్నట్లుంది. అది పాడుచేద్దామనే ఉద్దేశ్యంతో ఈయన "తుమ్మెదా!" "తుమ్మెదా!" అంటూ పాడుతున్నాడు. నిజంగా తుమ్మినా తుమ్మకపోయినా ఈ బెదరింపులకు ఆ 'రాచిలుక' మనస్తత్వంలో మార్పులు ఏర్పడి పని పాడుచేస్తుందనడంలో సందేహం లేదు. అందులో ఒకసారి తుమ్ముతాననడం!

ఇది సమంజసం అని ఎవరూ అనలేరు. భారతరాజ్యాంగం ప్రకారం అందరికీ ప్రాథమిక హక్కులున్నాయి. ఇంకొకరి హక్కులకు భంగం కలగనంతకాలం తోచినది మాట్లాడవచ్చు; వ్రాయవచ్చు; ఉపన్య

(55-వ పేజీ చూచండి)

# ప్రేక్షకుల అభిప్రాయాలు

## "ఓరపకురా చెడేవు"

చిత్రం బాగానే వుంది. నటీనటుల్లో ఎన్. టి. రామారావు చిన్నపోర్షనయినా బాగా పోషించాడు. అమర్‌నాథ్, జానకీలుకూడా ఫరవాలేదు. హాస్యం రేలంగి బాగా ప్రదర్శించాడు. "ఏడుజన్మలు" నాటకంలో "లైలామజ్నూ" "దేవదాసు" "అనార్‌కలి"ల, లోని ఘట్టాలు చూపించడము బాగున్నది. పాటలలో "ఏడు జన్మలా ప్రేయసివి నీవే", "ఆపకురా మురళీ" బాగున్నవి. భాస్కరరావుగారు మొదటసారి దర్శకత్వం వహించినా చిత్రాన్ని బాగా తీశాడు. ఈ చిత్రం తప్పకుండా విజయవంతమాతుంది.

తాటి - పరంధామ్,

—గుంటూరు.

*   *   *

ఈ చిత్రము అనేకమంది ప్రజలను ఆకర్షిస్తున్నది. ముఖ్యంగా రాజసులోచన, జానకి, అమర్‌నాథ్, ఆర్. నాగేశ్వరరావు గారలు అత్యద్భుతంగా నటించారు. ఎన్. టి. రామారావు, చంద్రకుమారి, పుష్పలత, లక్ష్మిరాజ్యం మామూలుగా నటించారు. ముఖ్యంగా రాజసులోచన నృత్యము కన్నుల పండువుగా వుంది. రేలంగి తన హాస్యముతో ప్రజలను ఉబ్బి తబ్బిబ్బు చేశాడు.

"గులాబీల తోట, బుల్ బుల్ పాట" అనే పాట నృత్యము చాలా మనోహరముగా వున్నవి. కనీసము ఈ పాటకైనా మరోసారి చిత్రాన్ని చూడాలనిపిస్తుంది.

ఆర్. వెంకటేశ్వర్లు,

—కర్నూలు.

*   *   *

కథావస్తువు చాలా సంతృప్తికరంగా ఉన్నది. చిత్రానికి పేరు అతికినట్లుగా ఉండి సరిపోయింది. మాటలు చాలా బాగున్నాయి. ఘంటసాలవారి సంగీతం వీనుల విందుగా నున్నది. రేలంగి హాస్యము కొంత వరకు చిత్రవిజయానికి కారణం. మంచి సెంటు వుండి ముఖ్యంగా పిల్లలను ఆకర్షించింది. రాజసులోచన నృత్యాలు ఇంపుగా వున్నాయి. "ఏడు జన్మలు" అనే అంతర్నాటకం ప్రేక్షకుల ప్రశంసలందుకొంది.

కె. రాజశేఖరరెడ్డి,

—గుంటూరు.

---

బిమల్‌రాయ్ నిర్మిస్తున్న "అమానత్" చిత్రంలో నటిస్తున్న చాంద్ ఉస్మానీ ఆ చిత్రం ప్రొడక్షన్ మేనేజరు మణిఛటర్జీని వివాహం చేసుకొంటుందని బొంబాయి సినిమారంగంలో వినవస్తున్నది. ★

## పెకింగ్‌లో భారతీయ చలనచిత్రోత్సవం

సెప్టెంబరు నెలలో భారతీయ చిత్రాలు దోబిఘాజమీన్, ఆవారా, ఆంధియాన్ చైనా రాజధాని పెకింగ్‌లో ప్రదర్శింపబడతాయట. సెప్టెంబరు 22 నుండి 29 వరకూ పెకింగ్‌లోనూ, తర్వాత ఇతర నగరాలలోనూ భారతీయ చలనచిత్రోత్సవం జరుగుతుంది.

---

## 'తుమ్మెదా ఒకసారి...'

(10-వ పేజీ తరువాయి)

సించవచ్చు. అదేవిధంగా ఇష్టం వచ్చినన్నిసార్లు తుమ్మవచ్చునుకూడా! కాని ఈ తుమ్ముల్ని 'ఇతరులకు నష్టం కలగాలనే ఉద్దేశ్యంతో; తన తుమ్ములవలన ఇతరులకు నష్టం కలగవచ్చునని తెలిసికూడా ఉదాసీన భావంతో ఉపయోగించడం రాజ్యాంగం సహించదు; అంగీకరించదు. ఎవరైనా ఉన్నత న్యాయస్థానానికి పోతే తప్పక నెగ్గుతారు.

నేను కర్తను ప్రార్థిస్తున్నాను. (ఆయన ఎవరో నాకు తెలియదు) నేను కర్తను ప్రార్థిస్తున్నాను: ఈ విధంగా - దురుద్దేశ్యంతో - 'ఒకసారి' తుమ్మడం తగదు! అసలు సాధ్యమయినంతవరకు తుమ్మనే తుమ్మవద్దు - కాని తప్పనిసరి అయితే అధమం రెండుసార్లైనా తుమ్మాలి! కర్తగారు నామాటలలోని సహృదయత్వాన్ని అంగీకరిస్తున్నారని ఆశిస్తున్నాను. అతిత్వరలోనే "తుమ్మెదా రెండుసార్లు..." అంటూ పాటను వినే అవకాశం కలుగుతుందని విశ్వసిస్తున్నాను. ★

---

రాజ్యం పిక్చర్సువారి "హరిశ్చంద్ర" ప్రారంభోత్సవంలో క్లాప్‌బోయ్ రేలంగి, చంద్రమతిగా నటిస్తున్న లక్ష్మిరాజ్యం. ఈ చిత్రంలో హరిశ్చంద్రుడుగా ఎస్. వి. రంగారావు నటిస్తాడట. దర్శకుడు: జంపన.

